క్లుప్తంగా

హెపటైటిస్ వ్యాక్సిన్‌తో వ్యాధి నయం

అద్దంకి: హెపటైటిస్ బీ పరీక్షలు నిర్వహించిన వారిలో నెగిటివ్ వచ్చినవారంతా వ్యాక్సిన్ వేయించుకోవాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ అవుట్ రిచ్ వర్కర్ టీ దుర్గా భవాని అన్నారు. సోమవారం అద్దంకి పట్టణంలోని పసుమర్తిపాలెంలో వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు. బాపట్ల జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ సమీకృత వ్యూహం (దిషా), ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏఎన్ఎం జె రాధమ్మ వ్యాక్సిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెపటైటిస్ బీ పరీక్షలు నిర్వహించిన వారిలో ఎవరికైనా నెగిటివ్ వచ్చిన వారికి వారి గృహాల వద్ద వ్యాక్సిన్ అందిస్తారన్నారు. వేగంగా వచ్చిన వారికి స్థానిక ప్రభుత్వ వైద్యశాలకి పంపించి వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. వ్యాక్సిన్ కార్యక్రమంలో హెల్ప్ పిఈ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన


పైపులైన్ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

పూనూరు(యద్దనపూడి): మండలంలోని పూనూరు గ్రామంలో ఎస్సీ కాలనీలో జల్‌జీవన్ మిషన్ పథకానికి సంబంధించి పైపులైన్ నిర్మాణానికి పూజా కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి రూ.94 లక్షలు మంజూరు కావడంతో నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. బోయపాటి సాంబశివరావు, ఈదల అనిల్, గంథం కనకరాజు, కార్యదరిశ భాగ్యరాజు, గంధం శశికుమార్, వంకాయలపాటి వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘం సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తు

బల్లికురవ: బల్లికురవ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపకుడి పోస్టుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కే సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైన గుర్తింపు పొందిన విద్యాలయలం నుంచి ఎకనామిక్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలన్నారు. ఈనెల 24వ తేదీ లోపు పూర్తి బయోడేటాతో కళాశాలలో సంప్రదించాలని కోరారు.

డివైడర్ ఢీకొని సోలార్ లారీ బోల్తా


డివైడర్‌పై బోల్తా పడిన సోలార్ ప్లేట్ల లారీ

జే.పంగులూరు: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా డివైడర్ ఢీకొని లారీ బోల్తా పడటంతో డ్రైవర్‌కు స్వల్పగాయాలు అయ్యాయి. ఈఘటన మండల పరిధిలోని జాగర్లమూడివారిపాలెం ఫ్లైఓవర్ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాలు మేరకు.. చెన్నై నుంచి విజయవాడకు సోలార్ ప్లేట్లతో లారీ బయలు దేరింది. లారీ సరిగా జాతీయ జాగర్లమూడివారిపాలెం ఫ్లైఓవర్ సమీపంలోకి రాగానే డ్రైవర్ లూలూ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో లారీ డివైడర్‌ను ఎక్కి బోల్తాపడింది. గాయపడిన లారీ డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు.

హార్మోన్స్ సంబంధిత వ్యాధులపై అవగాహన



జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూర స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 9, 10వ తరగతి విద్యార్థినులకు ఒంగోలు ఉపాస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హార్మోన్స్ సంబంధిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండోక్రైనాజీ విభాగ వైద్యనిపుణులు డాక్టర్ వీ విజయవర్ధన్ హార్మోన్ సంబంధిత ప్రభావం వలన వచ్చే వ్యాధుల గురించి, వాటి నివారణకు చక్కని సలహాలు అందించారు. విద్యార్థినుల తమకున్న ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకొని, వాటి నివారణకు చక్కటి పరిష్కారం తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సోమేపల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు రాయిణి ప్రమీల పాల్గొన్నారు.

28 నుంచి శిల్పం, చిత్రలేఖనంలో శిక్షణ

అద్దంకి రూరల్: వర్ణికా పెయింటింగ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈనెల 28 నుంచి 31 వరకు శిల్పం, చిత్రలేఖనం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు వర్ణికా పెయింటింగ్ ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కత్తి బాల కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ సమయంలో విద్యార్థులకు ఉచిత భోజన వసతి కల్పించనున్నట్లు చెప్పారు.

పర్యవేక్షణ లేక.. పట్టించుకోక!

- అడ్రస్ లేని ఆహార సలహా కమిటీలు
- రేషన్ దుకాణాలపై కొరవడిన పర్యవేక్షణ
- సరుకుల పంపిణీలో అవకతవకలకు అవకాశం
- పట్టించుకోని అధికారులు
- నియోజకవర్గంలో 219 రేషన్ దుకాణాలు


అద్దంకి తహశీల్దార్ కార్యాలయం

అద్దంకి: అసలే కూటమి ప్రభుత్వం. ఆపై పాలన ఏడాది దాటింది. ఈఏడాదిలో ఎన్నో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయి. కాని అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన వారైతే చాలు అధికారులు సలాం కొట్టి గులాం అవుతూ పట్టినట్లుగా వ్యవహరిస్తున్నారు. రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి, నిరుపేదలకు నిత్యావసరాలు అందే విధంగా పర్యవేక్షించడం కోసం ఆహార సలహా సంఘాలను గతంతో నియమించారు. అయితే ఆ సంఘాలు ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు. సంఘాల ఉనికి లేకపోవడంతో పర్యవేక్షించాల్సిన అధకారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాంతో తూకాల్లో మోసంతోపాటు, స్టాకు వివరాలు, పంపిణీ జరిగిందా లేదా అని సరిచూసే యంత్రాంగం కొరవడింది.

త్వరలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది..

ఆహార సలహా కమిటీలను ఉన్నతాధికారులు ఆదేశిస్తే త్వరలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది. గతంలో కమిటీలు ఉండేవి. మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించేవారు.

శ్రీచరణ్, తహశీల్దార్

ప్రతి మూడు నెలలకు ఒక సారి సమావేశం..

ఆహార సలహా కమిటీ ఉంటే ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించి మండల స్థాయిలో దుకాణాల నిర్వహణపై సమీక్ష నిర్వహించేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. రేషన్ దుకాణాల్లో ఇష్టారాజ్యంగా పంపిణీ జరుగుతందనే విమర్శలు కోకొల్లలుగా ఉన్నాయి. అద్దంకి, అదకి రూరల్ తోపాటు నియోజకవర్గంలో 219 దుకాణాలున్నాయి. 88,502 రేషన్‌కార్డులు ఉన్నాయి.

ఆహార సలహా కమిటీ చైర్మన్‌గా తహశీల్దార్

ఆహార సలహా కమిటీకి చైర్మన్‌గా జిల్లాస్థాయిలో కలెక్టర్, మండల స్థాయిలో తహశీల్దార్ వ్యవహరించేవారు. సభ్యులుగా జెడ్పీటీసీలు, ఎంపీడీవో, పాత్రికేయులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులను నామినేట్ చేసేవారు. ప్రతి మూడు నెలలకు ఒక సారి కమిటీ సమావేశం నిర్వహించి సరుకులు సక్రమంగా పంపిణీ అవుతున్నాయా? లేదా అని సమీక్షించేవారు.

నియోజకవర్గంలో కార్డులు, దుకాణాల వివరాలు..

మండలం	కార్డుల సంఖ్య	దుకాణాలు
అద్దంకి	25,773	58
బల్లికురవ	17,466	41
కొరిశపాడు	14,637	43
జే. పంగులూరు	14,896	34
సంతమాగులూరు	18,730	43

ఎండీయూల ఎత్తివేతతో కమిటీ అవసరం..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయంలో ఎండీయూ వాహనాలు ఇంటింటికి వద్దకువచ్చి కార్డుదారులకు నేరుగా సరుకులను పంపిణీ చేసేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎండీయూ వాహనాలను ఎత్తివేయడంతో, మళ్లీ ఆహార సలహా కమిటీల ఆవశ్యకత ఏర్పడింది. ఈ క్రమంలో అధికారులు, మరలా ఆహార సలహా కమిటీలను ఏర్పాటు చేసి నిత్యాసర వస్తువుల పంపిణీని పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మురుగు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు


బ్లీచింగ్ చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

చినగంజాం: దిపపత్రికల్లో వస్తే తప్పా.. అధికారులు పనిచేయడం లేదు. డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని మురుగు నీరు ఇబ్బందిగా ఉందంటూ ఈ నెల 19న సాక్షి దినపత్రికలో కథనాన్ని ప్రచురించింది. ఎట్టకేలకు అధికారుల నుంచి స్పందన లభించింది. చినగంజాం పంచాయతీ పరిధిలోని మసీదు పేట, చుండి బజార్‌లలో డ్రైనేజీ సౌకర్యం లేక మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుండటంపై స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని సాక్షి ప్రచురించింది. మురుగు పేరుకుపోయిన ప్రాంతాల్లో నీటిని తొలగించి, బ్లీచింగ్ చల్లి దోమల వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయంలో సమస్యల పరిష్కారం


కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రభాకరరావు

చినగంజాం: ప్రజల సమస్యలను తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమంలో పరిష్కరించుకోవాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. కార్యాలయంలో ఆయన సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో మాట్లాడారు. మండల పరిధిలో ప్రజలు తమ సమస్యలను నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలని, వారి సమస్యలు మండల స్థాయికి మించి ఉంటే జిల్లా స్థాయికి కార్యాలయం నుంచి నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లా కేంద్రానికి వెళ్ల ఆర్థికంగా, శారీరకంగా ఇబ్బందులు పడకుండా తహసీల్దార్ కార్యాలయంలో పరిష్కరించుకోవాలని కోరారు. కుటుంబ సమస్యల మినహా భూ వివాదాలు, సర్టిఫికేట్‌లు, అడంగల్ నమోదు, పాస్ పుస్తకాలు జారీ, భూములు సర్వే వంటి పలు కార్యక్రమాలకు స్థానికంగా పరిష్కరించుకోవచ్చని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎన్ విజయ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికలు ప్రతినిత్యం అప్రమత్తంగా మెలగాలి


బాలికలకు అవగాహన కల్పిస్తున్న శక్తి టీం

చినగంజాం: సమాజంలో బాలికలు ప్రతి నిత్యం అప్రమత్తంగా మెలగాల్సిన అవసరం ఉందని చీరాల శక్తి టీం ఎస్ఐ హరిబాబు సూచించారు. మండల కేంద్రం చినగంజాంలో కస్తూరిబా బాలికా విద్యాలయాన్ని శక్తి టీం సందర్శించి బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికా విద్యాలయంలోని విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైం, సెల్ ఫోన్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్ బుక్,ట్విట్టర్ మొదలైన మీడియాలను దుర్వినియోగం చేయడం వంటి వాటిపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాలికా విద్యాలయం ప్రిన్సిపాల్ సుమాంజలి, ఉపాధ్యాయ సిబ్బంది, శక్తి టీంలోని మహిళా కానిస్టేబుళ్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ఆషాఢం సారె సమర్పణ


గంగమ్మతల్లి మూల విరాట్



చినగంజాంలో ఆషాఢం సారెతో మహిళలు

వేటపాలెం: స్థానిక పాకనాటి రెడ్ల వీదిలో వేంచేసియున్న గంగమ్మ తల్లికి ఆషాఢ మాసంలో సారె పంపిణీ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు చీర, జాకెట్, పసుపు, కుంకుమ, పండ్లు, పూలు, కొబ్బరికాయ, ఎండు కొబ్బరి, చలివిడి, స్వీట్లు, ప్రసాదాలతో గ్రామంలో మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి ఆషాఢం సారె అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

చినగంజాంలో..

చినగంజాం: ఆషాఢ మాసం సందర్భంగా మండల కేంద్రమైన చినగంజాంలో భక్తులు పార్వతి అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక గంగా పార్వతీ సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయంలో వేంచేసియున్న పార్వతి మాతకు సమరసత ఫౌండేషన్ మహిళా విభాగం కన్వీనర్ ఉప్పుగుండూరి లలిత ఆధ్వర్యంలో అమ్మవారికి చీరను సమర్పించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు, ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ దండుప్రోలు వెంకటరావు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

చీరాల టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యతని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈపూరుపాలెం పంచాయతీ సెక్రటరీ మురళీ బాపూజీ సూచించారు. సోమవారం ఈపురుపాలెం గ్రామంలో ప్రత్యేక పారిశద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని గాంధీపార్కు కూడలి, సావరపాలెం, 40 ఇండ్లకాలనీ, పద్మనాభునిపేట, సీతారాంపేట, ఇందిరానగర్‌కాలనీ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. సెక్రటరీ వెంట పంచాయితీ సిబ్బంది, కార్మికులు ఉన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

చీరాల రూరల్: క్షయవ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని టీబీహెచ్‌వీ శ్రీలక్ష్మి సూచించారు. టీబీ ముక్తి భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక మసీదు సెంటర్లోని అసపాలి మున్సిపల్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడారు. టీబీవ్యాధి రావడానికి అనేక కారణాలు ఉన్నాయని, టీబీ వ్యాధి అంటువ్యాధని అది ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందని చెప్పారు. షుగర్ రోగులు, ధూమపానం, మద్యపానం సేవించేవారు, పల్మనరీ టీబీ మందులు వాడిన కుటుంబ సభ్యులు ఆర్టీపీసీఆర్ క్లె పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, నారపరెడ్డి, దానమ్మ, రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు నిరంతరాయంగా అన్నదానం

వేటపాలెం: పేదలకు నిరంతరాయంగా ఓవ్యక్తి అన్నార్తుల ఆకలి తీరుస్తున్నాడు. మండల కేంద్రం వేటపాలెం పాత మార్కెట్ వద్ద కృష్ణ మానినేని అన్న సూక్తిం ఉచిత భోజన స్టాల్ ఏర్పాటు చేసి కొన్ని నెలలుగా అన్నదానం చేస్తున్నాడు. ఆయన రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్న సూక్తం పేరుతో పేదల ఆకలి తీర్చడానికి ఉచిత భోజనం స్టాల్స్ ప్రారంభిచాడు. ఇతను 100 డ్రీమ్స్ ఫౌండేషన్ స్థాపించి పేదవాడికి సాయపడే విధంగా కార్యక్రమాలు చేస్తుంటారు.

ఏబీసీపై వాహనాల రాకపోకలు నిషేధం


ఏబీసీపై నిర్మిస్తున్న వంతెన



డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేస్తున్న జేసీబీ

బల్లికురవ: నాగార్జున సాగర్ అద్దంకి బ్రాంచ్ కాల్వ 33/2 మైలురాయి వల్లాపల్లి లాకుల సమీపంలో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులకు సంబంధించి కాల్వలో తూములు, డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. భారీ వాహనాల రాకపోకలు నిషేధించినట్లు అద్దంకి ఆర్‌అండ్‌బీ డీఈ, ఏఈలు నరసింహారావు, శ్రీమన్నారాయణలు సోమవారం తెలిపారు. 5వ శతాబ్దాల క్రితం బల్లికురవ అద్దంకి మండల్లాలోని 10 గ్రామాల రైతులు పంట ఉత్పత్తులను తరలించుకోనేందుకు బాటసారులు రాకపోకలకు సింగిల్ బ్రిడ్జిని నిర్మించారు. బల్లికురవ అద్దంకి ఆర్‌అండ్‌బీ రోడ్డు డబుల్ రోడ్డు 10 ఏళ్ల క్రితం డబుల్ రోడ్డుగా అభివృద్ధి పరచినా ఇక్కడ మలుపులు ఉండటం, పాత బ్రిడ్జికి ఇరువైపుల యాంగ్లర్లు వంగడంతో అనేక ప్రమాదాలు సంభవించాయి. ప్రభుత్వం రూ. 1.65 కోట్లు మంజూరుతో మలుపును తొలగించి పాత బ్రిడ్జికి తూర్పు వైపున 12 మీటర్లు వెడల్పు, 30 మీటర్ల పొడవున నూతన బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. పాత బ్రిడ్జికి పడమరవైపున డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. గ్రానైట్ భారీ వాహనాల రాకపోకలు నిషేధించామని, ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని వారు కోరారు. సాగర్‌కాలువ నీటి పారుదల జరిగేలోపు నెల రోజుల్లో పనులు పూర్తి చేయిస్తామని వాహనదారులు సహకరించాలన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభం


ప్రారంభించిన పొగాకు కొనుగోలు కేంద్రం

జే. పంగులూరు: మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో సోమవారం నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల తహసీల్దార్ పీ సింగారావు చేతుల మీదగా పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సింగారావు మాట్లాడుతూ పంగులూరు మార్కెట్ యార్డు పూర్తిగా పొగాకు బేళ్లతో పూర్తిగా నిండిపోయిందన్నారు. అనంతరం కొప్పెరపాడు సొసైటీ వద్ద నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనట్లు తెలిపారు. తూర్పుకొప్పెరపాడులో 70 బేళ్ల వరకు భద్రపరచవచ్చన్నారు. ఈ అవకాశాన్ని పొగాకు రైతులు సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. కొప్పెరపాడులో సొసైటీ పూర్తిగా నిండి తరువాత రైతులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయం ఆలోచిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంగులూరు సొసైటీ సెక్రటరీ లక్ష్మి, బయ్యర్ మారెళ్ల శ్రీధర్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

గణన పకడ్బందీగా పూర్తిచేయాలి


శిక్షణలో మాట్లాడుతున్న తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ: 7వ చిన్నతరహా నీటి వనరులు, రెండవ జలాశయాల గణన గ్రామాల వారీగా పకడ్బందీగా పూర్తి చేయాలని తహసీల్దార్ కే.రవినాయక్ కోరారు. సోమవారం సాయంత్రం గణనపై వీఆర్వోలు, పర్యవేక్షకుల శిక్షణతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయకట్టు విస్తీర్ణం, డ్రిప్ ఇరిగేషన్, పంపుసెట్లు భూగర్భ జల పథకాలు, నీటి పథకాలు, చెరువులు, కుంటలు, వ్యవసాయ వనరులపై ఆగస్టు 10 తేదీలోపు గణన పూర్తి చేసి నివేదికను పూర్తిచేసి అందజేసామని తహసీల్దార్ అన్నారు. ఈశిక్షణలో ఆర్టీసీ కార్యాలయ డిప్యూటి పీఎస్ కమలాకరరావు, ఏఎస్‌వోలు అమర్‌నాథ్, ప్రసాద్ పాల్గొని మాట్లాడారు.

ఏఎంసీ చైర్మన్ బాధ్యతల స్వీకరణ

చీరాల అర్బన్: చీరాల వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్‌గా కొతరపు జనార్ధన్ సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా దేశాయిపేటలోని ఏఎంసీ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లచే ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ప్రమాణ స్వీకారం చేయించారు. మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన మించాల సాంబశివరావును చీరాల రోటరీ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. తమ రోటరీ సభ్యుడు మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయనను క్లబ్లో రోటరీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరించిన ఏఎంసీ పాలకవర్గ సభ్యులు

చినుకు పడితే చిత్తడే !


స్వర్ణ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అవస్థలు


వర్షానికి కారంచేడులో బ్రహ్మంగారి గుడి బజారు దుస్థితి ఇలా..

కారంచేడు: కొద్దిపాటి వర్షాలకు కూడా గ్రామీణ ప్రాంత లోతట్టు ప్రాంతాలు జలమయంగాను, బురదమయంగాను మారుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలో 52 మీమీ వర్షపాతం నమోదైంది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు నీటమునిగి ఉన్నాయి. మండల కేంద్రమైన కారంచేడు చినవంతెన సెంటర్ నుంచి బ్రహ్మంగారి గుడిబజారు వంటి ప్రాంతాల్లోను రహదారులు బురదగా మారాయి. స్వర్ణ ఉన్నత పాఠశాల ప్రాంగణం సైతం దిగువగా ఉండటంతో నీరు నిలబడి విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి సైతం ఇబ్బంది పడ్డారు.